క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంచాల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధి లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు విడతల వారీగా అందజేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారి రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

మంచాల: మండల పరిధి తాళ్లపల్లిగూడ శ్రీభవాని రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా డాక్టర్ ఎస్.కె.భిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం దేవాదయశాఖ ఈఓ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా భిక్షపతి, సభ్యులుగా హరికిషన్, ఐలయ్య, యాదయ్య, అనితను నియమించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. కమిటీ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చేయండి



ఎంపీఓకు ఫిర్యాదు అందజేస్తున్న గిరిజనులు

యాచారం: మంతన్‌గౌడ్ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 44లో కొందరు అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే వాటిని కూల్చి వేయాలని మీసాల, కేసీతండాల గిరిజనులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పంచాయతీ అధికారి శ్రీలతకు ఫిర్యాదు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ప్రజా అవసరాల నిమిత్తం గతంలో ప్రభుత్వం సర్వే నంబరు 44లో రెండు ఎకరాల 20 గుంటల భూమిని కొనుగోలు చేసిందని తెలిపారు. నేడు అదే భూమిలో నేడు అక్రమంగా నివాసాలు వెలుస్తున్నాయని, వెంటనే వాటిని అడ్డుకోవాలని కోరారు. దీనికి స్పందించిన జీపీ అధికారి.. తహసీల్దార్ అయ్యప్పతో మాట్లాడి, సమస్యను వివరించారని, సర్వే అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గిరిజనులు పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఆపరేషన్ల నిమిత్తం 21 మందిని మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో లయన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాషా, లయన్ జిల్లా చైర్మన్లు రమేశ్, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది తరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు అందాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణిలో ఐదు ధరణి, ఒకటి గ్రామ కంఠం భూమి ఆక్రమణకు సంబంధించిన దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఈ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి

ఇంటి పన్ను వసూలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కొంత కాలంగా ప్రజాపాలన సభలు, కులగణన సర్వేలో బిజీగా ఉన్నారు. అనంతరం స్థానిక ఎన్నికల కసరత్తు పనుల్లో నిమగ్నమైన అధికారులు.. ఇప్పట్లో ఎన్నికలు లేవనే సంకేతంతో నూరుశాతం పన్ను రాబట్టేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే సమయంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.



నస్దిక్‌సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయం

పంచాయతీల్లో నిధుల లేమి

- జీపీ కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి
- స్థానిక పోరు వాయిదా.. పన్ను వసూలుకు అధికారుల కసరత్తు
- లక్ష్యం రూ.1.38 కోట్లు

యాచారం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూలుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మండల పరిధి 24 గ్రామ పంచాయతీల్లో 2024– 25 ఏడాది గాను టార్గెట్ రూ.1,38,87,382లు ఉంది. మేజర్ గ్రామ పంచాయతీలైన నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, మాల్, యాచారం, చింతపట్ల, మాల్, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వసూలు టార్గెట్‌గా అధికారులు నిర్ణయించారు. చిన్న గ్రామాలైన మొండిగౌరెల్లి, తమ్మలోనిగూడ, నస్దిక్‌సింగారం, గడ్డమల్లయ్యగూడ, అయ్యవారిగూడెం, కేసీతండా, తక్కళ్లపల్లితండా పంచాయతీల్లో రూ.10 లక్షల లోపే ఉంది.

జిల్లాలో ఆరో స్థానం

పన్ను వసూలులో యాచారం మండలం జిల్లాలో ఆరో స్థానంలో ఉంది. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,38,87,382 టార్గెట్‌కు గాను, ఇప్పటి వరకు రూ.81,21,673లు ప్రజల నుంచి రాబట్టారు. మార్చి 25 లోపు అన్ని గ్రామాల్లో వంద శాతం వసూలు చేసేందుకు కృషి చేయాలని మండల పంచాయతీ అధికారి శ్రీలత.. పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గ్రామాలు, కాలనీల్లో ఇంటింటికి తిరిగి పన్ను వసూలు చేయాలని, ఎప్పటికప్పుడు వసూలు నివేదిక అందజేయాలని సూచించారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను గుర్తించి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అధికంగా ఉన్న యాచారం, మాల్, గునుగల్, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో వందశాతం పన్ను సకాలంలో వసూలు చేయవచ్చనే ధీమాల్లో ఉన్నారు. ఇప్పటికే అందరికీ నోటీసులు అందజేశారు.

ఇంటింటికీ అధికారులు

గడిచిన ఏడాది కాలంగా పంచాయతీలకు పాలక వర్గాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రత్యేక నిధులు నిలిచిపోయాయి. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఇదే విషయమై నస్దిక్‌సింగారం గ్రామం పారిశుద్ధ్య కార్మికులు పలువురు.. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలతకు విన్నవించారు. విధి నిర్వహణ అనంతరం కనీసం చేతులు శుభ్రం చేసుకుందామన్నా.. సబ్బులు లేవని, దుస్తులు, చీపుర్లు కూడా లేవని తమ గోడు వెళ్లబోసుకున్నారు. దుర్వాసనతో ఇంటికి వెళ్తే పిల్లలు భయపడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొండిగౌరెల్లి, కొత్తపల్లి, తమ్మలోని గూడ, నల్లవెల్లి, చౌదర్‌పల్లి, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ, ధర్మన్నగూడెం గ్రామాల్లో జీతాలు అందక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం చేపట్టే పన్నుల వసూలుతో అయినా.. పంచాయతీ సిబ్బందికి కాస్త ఊరట లభించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ప్రత్యేక ప్రణాళికతో అధికారులు ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు.



నానక్‌నగర్‌లో యజమాని నుంచి ఇంటి పన్ను తీసుకుంటున్న జీపీ సిబ్బంది

నాలుగు నెలలుగా జీతం లేదు



మాకు నెలనెల జీతం అందలేదు. ఇచ్చే కొద్ది పాటి వేతనానికి ఉదయం 6 గంటల నుంచి పారిశుద్ధ్య పనులు చేస్తున్నాం. వీధులు, రోడ్లు ఊడ్చడం, మురుగు కాల్వలు శుభ్రం చేస్తుంటాం. అనంతరం చేతులు శుభ్రం చేసుకుందామన్న సబ్బులు లేవు. నాలుగు నెలలుగా వేతనం అందడం లేదు. ప్రజలు పన్ను చెల్లిస్తే అందరికీ మేలు.

– బాలమణి, పారిశుద్ధ్య కార్మికురాలు, నస్దిక్‌సింగారం

స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం



మేజర్ గ్రామ పంచాయతీ నందివనపర్తిలో రూ.10 లక్షలకు పైగా పన్ను టార్గెట్ ఉంది. వీటిల్లో కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటికే 40 శాతానికి పైగా రాబట్టాం. ఇంటింటికి తిరిగి వంద శాతం పన్ను వసూలుకు కృషి చేస్తున్నాం. కొన్ని పరిశ్రమలకు డిమాండ్ నోటీసులు జారీ చేశాం.

– ఈర్లపల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, నందివనపర్తి

మార్చి 20 వరకు..



మార్చి 20 లోపు వంద శాతం పన్ను వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాం. ఇన్నాళ్లు ప్రజాపాలన, కులగణన సర్వే చేశాం. స్థానిక ఎన్నికలు ఉంటాయని ఆ పనుల్లో బిజీగా ఉన్నాం. ఇక నుంచి నిత్యం పన్ను రాబట్టడమే లక్ష్యం. పన్ను రూపంలో వచ్చిన నిధులతో పంచాయతీల సిబ్బందికి జీతాలు, ఇతర పనులకు ఖర్చు చేస్తాం.

– శ్రీలత, మండల పంచాయతీ అధికారి

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: వేసవికాలంలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా ఎలా ఉంది? ఎక్కడైనా సమస్య ఉందా, పెండింగ్ పనులు ఉన్నాయా, నిధులు అవసరమున్నాయా తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఏ గ్రామంలోనైనా సమస్యలు ఉంటే అధికారులు వెంటనే స్పందించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి పైప్‌లైన్ మరమ్మతు, మరేదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. సమావేశంలో భగీరథ డీఈలు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఏఈలు శరత్, వాగ్దేవి, ప్రణీత్, శ్రావ్య, కేతన్, శ్రీనివాస్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తొద్దు

కడ్తాల్: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధి మద్దెలకుంటతండాలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు, నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తండాలో కరెంట్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నరేందర్, డీసీసీ అధికార ప్రతినిధి విఠలయ్యగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యాదయ్య, సుమన్ తదితరులు ఉన్నారు.

కల్వర్టు నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తులేఖుర్దు గ్రామస్తులు, నాయకులు

యాచారం: గ్రామ సమస్యలు పరిష్కరించాలని తులేఖుర్దు గ్రామస్తులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటికపల్లి రాజయ్య, కిష్టయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. తగిన నిధులు కేటాయించి కల్వర్టు నిర్మాణంతో పాటు.. ఇతర సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఇదే అంశంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

సంతకు స్థలం కేటాయించండి

మాల్ పశువుల సంతకు సర్వే నంబరు 640లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని గ్రామస్తులు కోరారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దు అయిన మండల పరిధి మాల్‌లో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతుందని పేర్కొన్నారు. శాశ్వత స్థలం లేకపోవడంతో ప్రైవేట్ స్థలాల్లో అంగడి కొనసాగుతుందని తెలిపారు. దీని వలన ఇబ్బందిగా ఉందని, సొంతంగా స్థలం కేటాయిస్తే.. పంచాయతికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తుందని చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సంతకు స్థలం కేటాయించాలని కలెక్టర్ నారాయణరెడ్డికి లేఖ రాశారని గ్రామస్తులు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, రాజారెడ్డి, జంగీర్, రమేష్, బాల్‌రాజ్, గాలయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేసేవారికి గుర్తింపు

మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాలరాజు



గృహప్రవేశ పూజలో జైపాల్‌యాదవ్, బాలరాజు, ఉప్పల తదితరులు

ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్టు సేవలు భేష్ అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండల పరిధి కోనాపూర్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేద బొడ్డుపల్లి జంగమ్మకు ఇంటిని నిర్మించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ ఇంటిని మాజీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ.. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్.. నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ప్రజల అభిమానం పొందుతున్నారని తెలిపారు. సేవాభావంతో పనిచేసేవారికి ప్రజల అండదండలు ఉంటాయని పేర్కొన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా గృహ ప్రవేశం చేయించడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, సంజీవ, శేఖర్, యాదగిరి, రవి, బద్ర, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే రాణింపు

తుర్కయంజాల్: ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఎల్మటి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో కామినేని ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలరని తెలిపారు. ఈ సందర్భంగా 383 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సామ బీంరెడ్డి, మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్య గౌడ్, సభ్యులు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, జ్యోతి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు

మురుగు కాల్వను విస్తరించాలని వినతి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: కమ్మగూడలోని లక్ష్మీనగర్, సుందరయ్య కాలనీల సమీపంలో వదిలేసిన మురుగు కాల్వను తొర్రూర్ రోడ్డు వరకు విస్తరించాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ డీఈ భిక్షపతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుర పరిధి కమ్మగూడలోని పలు కాలనీల నుంచి వెలువడిన మురుగు నీటిని.. తమ కాలనీల సమీపంలో వదిలివేయడం వలన వ్యర్థ జలాలు ఇక్కడే నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో దుర్వాసనతో పాటు, దోమలు, ఈగలు పెరిగి ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్, ఇంజాపూర్ జోన్ బాధ్యుడు మండల సత్యనారాయణ, నాయకులు ఇల్లూరి భాస్కర్, శ్రీనివాసులు, కృష్ణ, నరసింహ, సత్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: కేసీఆర్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తదితరులు



యాచారం: మొక్కలు నాటుతున్న గులాబీ శ్రేణులు

కారణజన్ముడు కేసీఆర్

'బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారణజన్ముడు. అతి తక్కువ సమయంలో తెలంగాణ సాధించారు. అనతి కాలంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. ఆయన పరిపాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు' అని గులాబీ శ్రేణులు అన్నారు. కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఆమనగల్లు, ఇంబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో భారీగా కేక్‌లు కట్‌చేసి, సంబురాలు చేసుకున్నారు. అనంతరం వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటారు.

– సాక్షి, నెట్‌వర్క్



మాడ్గులలో..



ఆమనగల్లులో..



మంచాల: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అభివృద్ధి పనులు ప్రారంభం

ఆమనగల్లు: మండల పరిధి మంగళపల్లిలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పిరెడ్డి నారాయణరెడ్డి, గ్రామ కార్యదర్శి జగన్‌నాయక్, మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు రాఘవేందర్, కృష్ణయ్య, వెంకటేశ్, మల్లయ్య, నర్సింహ, మాధవరెడ్డి, లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదయ్య, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.



సీసీ పనులు ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

అందుబాటులో ప్రజాపాలన సేవా కేంద్రం



ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం

- ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారి వివరాలు నమోదు చేసుకునేందుకు మండల కేంద్రంలో ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వివరాలు ఇవ్వనివారి కోసం ప్రభుత్వం ఈ నెల 28వ తేదీవరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా సర్వేలో పాల్గొననివారు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపు 17,400లకు పైగా కుటుంబాలకు సర్వే జరిగిందన్నారు. అప్పుడు మండలంలో మొత్తం 36 ఇళ్లు మాత్రమే డోర్‌లాక్ అని వచ్చిందని చెప్పారు. వారితో పాటు ఇంకా ఎవరైనా మిగిలిపోయి సర్వేలో వివరాలు నమోదు చేసుకొనివారు ఉన్నా ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో నాబి శిల, ధ్వజస్తంభ, పోతురాజు విగ్రహాల పునప్రతిష్ఠ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి స్వగ్రామం కౌకుంట్లలో జరుగుతున్న ఈ పూజల్లో ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డి దంపతులు, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు.